సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 10 । ఆగస్టు । 2023



డిగ్రీ.. నో డిమాండ్
కేయూ పరిధిలో వివిధ రకాల డిగ్రీ కోర్సులు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరంలో 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. - 8లో



స్కూల్ బస్సును ఢీకొన్న జెడ్పీఫ్లోర్ లీడర్ వాహనం - 8లో
ఆగి ఉన్న స్కూల్ బస్సును జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న వాహనం ఢీకొని ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు.

గరిష్టం/కనిష్టం
34°/25°

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టీచర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



విద్యారణ్యపురి: తొమ్మిదేళ్లుగా టీచర్ల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. బుధవారం ఆ సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఏబీవీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ కమిటీ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని తదితర డిమాండ్లతో గురువారం ఏకశిల పార్కువద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం రెండు జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఆముదాల దాత మహర్షి, బత్తిని వీరస్వామి, ఉప్పుల సతీష్, బత్తిని వెంకటరమణ బాధ్యులు పిన్నింటి బాలాజీరావు, మాచర్ల భిక్షపతి, ఎం.నవీన్, రాంభూపాల్, తిరుపతిరావు, సంగెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరో రోజు 11 దరఖాస్తులు

కాజీపేట అర్బన్: వరంగల్ అర్బన్ పరిధిలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్‌లకు ఆరో రోజు బుధవారం 11 దరఖాస్తులు వచ్చినట్లు హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో వరంగల్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌కు 3, ఖిలా వరంగల్‌కు 1, హనుమకొండకు 5, కాజీపేటకు 2 దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులను కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. చివరిరోజు ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంటుందని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆమె సూచించారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ సీఐలు రామకృష్ణ, అంజిత్‌రావు, చంద్రమోహన్ ఉన్నారు.

అంతర్జాతీయ మెజీషియన్ సదస్సుకు వినయ్



హన్మకొండ చౌరస్తా: కేరళలోని కొచ్చిలో ఈ నెల 13, 14వ తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ మెజీషియన్ సదస్సుకు హనుమకొండ నయీంనగర్‌కు చెందిన బత్తుల వినయ్‌కుమార్ ఎంపికయ్యారు. కేరళకు చెందిన స్మామాట్ వరల్డ్ మ్యాజిక్ అనే సంస్థ ఆన్‌లైన్ ద్వారా చేపట్టిన ఎంపికలో హనుమకొండ జిల్లా నుంచి వినయ్‌కుమార్ ఒక్కరే ఎంపిక కావడం విశేషం. కేరళ టూరిజం శాఖ సహకారంతో రెండు రోజులపాటు జరగనున్న సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా వెయ్యిమంది మెజీషియన్లు ఇంద్రజాల ప్రదర్శన చేయనున్నారు.

నేటినుంచి సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్/కాశిబుగ్గ: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారంనుంచి రెండు రోజులపాటు ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా వరంగల్ జిల్లాకు సంబంధించిన పోటీలు ఓ సిటీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ ఇందిర తెలిపారు. 17 క్రీడా అంశాల్లో పోటీలు ఉంటాయని, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల ఉద్యోగులు ఉదయం 10 గంటలకు హనుమకొండలోని ఇండోర్ స్టేడియం నందు, వరంగల్‌కు సంబంధించి ఓ సిటీలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

11న ఉద్యోగులకు నియామక పత్రాల అందజేత

హన్మకొండ అర్బన్: జిల్లాలో వీఆర్‌ఏలుగా పనిచేసి ప్రభుత్వ ఆదేశాలతో వివిధ శాఖల్లో సర్దుబాటు అయి జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, రికార్డ్ అసిస్టెంట్‌తోపాటు వివిధ హోదాల్లో పోస్టులు పొందిన 304మందికి నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ నెల 11న హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి మంత్రి దయాకర్‌రావు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ ఉత్తర్వులు అందజేయనున్నారు. ఇదే కార్యక్రమంలో వరంగల్ జిల్లాలో ఉద్యోగాలు పొందిన వారికి కూడా అందజేస్తారు. రెండు జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరవుతారు.

నాడు వద్దు.. నేడు ముద్దునా..!

నగరంలో ఆదాయం కోసం జంక్షన్లు, రోడ్ల మధ్యలో భారీ ప్రచార హోర్డింగ్‌లు

- స్మార్ట్‌సిటీలో నాలుగేళ్ల కిందట తొలగించి, ఇప్పుడు ఏర్పాటుపై విమర్శలు
- హోర్డింగ్‌ల వల్ల వాహన చోదకులకు ప్రమాదాలే
- ఆకర్షణీయ నగర సుందరీకరణకు విఘాతం



ఈ ఫొటో చూడండి. హనుమకొండ కలెక్టరేట్ బంగ్లా ముందు ఏర్పాటుచేస్తున్న భారీ ప్రచార హోర్డింగ్. రోడ్డు మధ్యలో దీనిని నిర్మించారు. అటు, ఇటు జంక్షన్‌కు కనీసం 300మీటర్ల దూరంలో ఉంటుంది. ఆ జంక్షన్ వద్ద కనీసం ట్రాఫిక్ సిగ్నల్స్ కూడా లేవు. ఒకవేళ ఇక్కడ ప్రచార ప్రకటన ప్రదర్శిస్తే వాహనదారుల చూపు దానిపై పడితే ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. ఇలాంటివి నగరంలో పదుల సంఖ్యలో ఏర్పాటు చేస్తున్నారు.



వడ్డేపల్లి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్



అదాలత్ జంక్షన్‌లో..

వరంగల్ అర్బన్ : మహా నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్న జంక్షన్లను, జనాల రద్దీ ప్రాంతాల రోడ్లను మళ్లీ 'ప్రచార' కబ్జా చేస్తున్నారు. ఆదాయం కోసం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్.. హోర్డింగ్‌లకు అనుమతిస్తూ ఓ ప్రైవేట్ అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీకి కాంట్రాక్ట్ కట్టబెట్టింది. స్మార్ట్ సిటీలో ఐదేళ్ల కిందట వద్దనుకున్న హోర్డింగ్‌లను తిరిగి ఏర్పాటుచేయడంపై అనేక అనుమానాలకు తావిస్తోంది. బల్దియాకు ఆదాయం ఏమోగానీ వాహన చోదకులకు ప్రమాదం పొంచి ఉంది. దీనికితోడు ఆకర్షణీయ నగరం, క్లీన్‌సిటీ సుందరీకరణకు విఘాతంగా కలగనుంది. ఉన్నతాధికారులు, పాలకులు మారితే నిబంధనలు ఎలా మారుతాయంటూ నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఏమి జరిగిందంటే..

2012లో హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ప్రకటనల బోర్డుల ఏర్పాటుకు అనుమతించారు. హైదరాబాద్‌లో అట్టర్‌ఫ్లాప్ అయినా సదరు ప్రైవేట్ అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీ నగరంలోని జంక్షన్లను కబ్జా చేసి హోర్డింగ్‌లు ఏర్పాటు చేసింది. 21 ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్, సర్వేలెన్స్ కెమెరాలు, పెడిస్ట్రియల్ సిగ్నల్స్ నిర్వహణ బాధ్యత కూడా ఇచ్చారు. నాలుగేళ్లపాటు సదరు సంస్థ బల్దియాకు చెల్లించాల్సిన సొమ్మును ఎగనామం పెట్టింది. దీంతో బల్దియా.. ఆ సంస్థ ఒప్పందాన్ని రద్దు చేసింది. హనుమకొండ, మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన రెండు కంట్రోల్ రూమ్‌ల జాడ కూడా పత్తా లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో 2018 స్మార్ట్‌సిటీ అవతరించబోతున్నందున నగర సుందరీకరణకు విఘాతం కలుగుతుందని హోర్డింగ్‌లు వద్దనుకున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు హనుమకొండ, కాజీపేట, వరంగల్‌లోని సుమారు 18 జంక్షన్‌లలోని హోర్డింగ్‌లను నేలమట్టం చేశారు. వరంగల్ మూడు చోట్ల వదిలేశారు. వాటిని పాత ఇనుప సామన్లకు కొందరు అమ్ముకున్నారు.

భూతాల్లా భయపెడుతున్న హోర్డింగ్‌లు

నగరంలో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న భారీ హోర్డింగ్‌లు రోడ్డుపై వెళ్తున్న వాహనదారుల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కొన్నిచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ కనిపించక సదరు వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. బలహీనమైన ఫ్లెక్సీలు చిరిగిపోయి వాహనదారులను కప్పేస్తున్నాయి. హోర్డింగ్‌లకు, యూనిపోల్స్‌కు జీడబ్ల్యూఎంసీ పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు అజ్యం పోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వీయ నిర్ధారణ పత్రాలు తీసుకోవడంతో సరిపెడుతున్నారు. కానీ సొంతంగా తనిఖీలు చేసి హోర్డింగు బలంగా ఉందా..లోపాలేమైనా ఉన్నాయా..సామర్థ్యానికి మించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారా..తట్టుకోలేని భారాన్ని మోపుతున్నారా.. అన్న విషయాలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హోర్డింగ్‌ల సంస్థల నుంచి ముడుపులు తీసుకుని కొత్త, పాత వాటికి అనుమతులు ఇస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.

మారినప్పుడల్లా ప్రయోగాలే..

పాలకులు, కమిషనర్లు మారినప్పుడల్లా వరంగల్ నగరంపై ప్రయోగాలు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నాలుగేళ్ల కిందట వద్దని తొలగించిన భారీ హోర్డింగ్‌లను మళ్లీ ఇప్పుడు తెరపైకి తీసుకురావడం సరికాదని నిపుణులు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై బల్దియాకు చెందిన ఓ ఏసీపీని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశం అంటూ వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

ప్రస్తుతం 50చోట్ల ఏర్పాటు..

తాజాగా నగరంలోని 50 ట్రాఫిక్ జంక్షన్లు, రోడ్ల మధ్యలో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసేందుకు బల్దియా టెండర్లు పిలిచింది. పనులను ఓ సంస్థకు అప్పగించారు. ఏడాదికి రూ.54 లక్షల ఆదాయం కోసం ఐదేళ్ల లీజు పేరిట ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే అదునుగా నిర్వాహకులు ఎత్తు, పొడవు నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తుండడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జంక్షన్లతోపాటు రోడ్ల మధ్యలో ఏర్పాటు చేయడం ఏమిటన్నది అంతు బట్టడం లేదు. స్మార్ట్‌సిటీలో నాడు వద్దనుకున్న హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తుండటం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది.

15లోగా వ్యవసాయ గణన పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఇతర అధికారులు

హన్మకొండ అర్బన్: జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ గణనను ఈనెల 15లోగా పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామంలో 100శాతం గణన చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. దేశంలో వ్యవసాయ స్థితిగతులు తెలుసుకునేందుకు ఈ గణన ప్రత్యేక యాప్‌ద్వారా చేస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో వాస్తవ సమాచారం అందించాలన్నారు. సమావేశంలో సీపీఓ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గన్నారు.

నేటినుంచి అనాథల గుర్తింపు సర్వే

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరంలోని 66 డివిజన్లలో అనాథల గుర్తింపు కార్యక్రమం గురువారం నుంచి చేపట్టనున్నారు. అనాథలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో వారి వివరాలు సేకరించాలని చీఫ్ సెక్రటరీ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు, నగరాలు, పట్టణాల కమిషనర్లు సర్వే బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. 0 నుంచి 23 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న బాల, బాలికల వివరాలు మెప్మా ఆర్‌పీలు, బల్దియా సిబ్బంది సేకరించనున్నారు. ఈ నెల 15వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో సిబ్బంది.. అనాథ ఆశ్రమాలు, హోంలలో ఉన్నవారు, తల్లిదండ్రులు చనిపోయి బంధువులు, ఇతరుల వద్ద పెరుగుతున్న వారిని గుర్తించనున్నారు.

రాజకీయ వైరానికి తహసీల్దార్లు బలి

- ఆ తహసీల్దార్ మాకొద్దంటున్న ఓ ప్రజాప్రతినిధి
- బదిలీ చేయాలని అధికారులకు, నియోజకవర్గ ప్రజాప్రతినిధికి అల్టిమేటం

హన్మకొండ అర్బన్: జిల్లాలో అధికార పార్టీ నేతల మధ్య నెలకొన్న రాజకీయ వైరంలో తహసీల్దార్లు నలుగుతున్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాలోనూ తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో కొత్తగా వచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇవి దాదాపు రాకీయ ప్రమేయంగానే జరిగాయి. జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల ఉన్న ఓ నియోజకవర్గంలోని ఓ మండలానికి ఫలానా తహసీల్దార్‌ను ఇవ్వాలంటూ నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి జిల్లా ఉన్నతాధికారులకు సిఫార్సు లేఖ పంపించారు. ఆ మేరకు అధికారులు పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడివరకు బాగానే ఉంది. ఉత్తర్వులు పొందిన అధికారి నేరుగా విధుల్లో చేరారు. ఇక్కడినుంచి అసలు కథ ప్రారంభమైంది. అదే నియోజక వర్గంలో రాష్ట్రస్థాయి పలుకుబడి ఉన్న ఓ జిల్లాస్థాయి ప్రజాప్రతినిధి అగ్గిమీద గుగ్గిలమయ్యారు. తన సొంత మండలంలో తన ప్రమేయం లేకుండా పోస్టింగ్ ఇవ్వడంపై మండిపడ్డారు. విధుల్లో చేరిన అధికారి లీవ్ పెట్టి వెళ్లాలని ఆదేశించడంతో తహసీల్దార్ అదే పని చేసినట్లు సమాచారం. సిఫార్సు లేఖ ఇచ్చిన నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధి మీద తీవ్రస్థాయిలో ఆగ్రహించినట్లు తెలిసింది. వీరిమధ్య కొంతకాలంగా రాజకీయ పరంగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో పరిస్థితులు ఉన్నాయని పొలిటికల్ వర్గాల్లో టాక్. ఇటీవల ఈ పరిస్థితి మరీ రచ్చకెక్కింది. ఇలాంటి పరిస్థితుల్లో తహసీల్దార్ పోస్టింగ్ వ్యవహారం అగ్నికి ఆజ్యం పోసినట్లయిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఎందుకు పంతం...

తహసీల్దార్‌పై వ్యక్తిగతంగా ఎలాంటి వైరం లేకున్నా... ఈ నియామకాన్ని వ్యతిరేకిస్తున్న నేత పరిధిలో కొద్ది రోజుల క్రితం ఓ మహిళా అధికారితో ఏర్పడిన వైరమే కారణంగా తెలిసింది. ఈవైరం చినికి చినికి గాలివానగా మారి కేసుల దాకా వెళ్లింది. దానిని దృష్టిలో ఉంచుకుని ఉద్దేశపూర్వకంగా రాజకీయ కక్షతో ప్రసుత తహసీల్దార్ పోస్టింగ్ వేయించారని ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. అందుకే సదరు తహసీల్దార్‌ను వెంటనే మార్చాలని ఉన్నతాధికారులకు, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధికి అల్టిమేటం ఇచ్చినట్లు సమాచారం. ఈ పరిస్థితిలో జిల్లా అధికారులు ఏంచేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. సదరు తహసీల్దార్ మాత్రం చేయని పాపానికి తనకేంటి ఈ ఇబ్బందికర పరిస్థితులు అని తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నట్లు తెలిసింది.

ఐనవోలు తహసీల్దార్‌గా విక్రమ్
గీసుగొండకు సుభాషిణి



విక్రమ్ కుమార్

హన్మకొండ అర్బన్: వరంగల్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా పనిచేసి అక్కడినుంచి రెవెన్యూ శాఖకు రిపోర్ట్ చేసి హనుమకొండ జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు ఐనవోలు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఐనవోలు తహసీల్దార్ సుభాషిణి సెలవులో ఉన్నారు. బదిలీల్లో ఐనవోలు వెళ్లిన సుభాషిణిని అక్కడినుంచి గీసుకొండకు బదిలీ చేశారు.

14న కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి

డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, ఇచ్చిన హామీలను విస్మరించడాన్ని నిరసిస్తూ ఈ నెల 14న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రజా గాయకుడు గద్దర్, జర్నలిస్టు జహీరుద్దీన్ అలీఖాన్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం నాయిని మాట్లాడుతూ అర్హులైన పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, వరదలతో ఆర్థికంగా నష్టపోయిన, మృతిచెందిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని తదితర డిమాండ్లతో ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం క్విట్ ఇండియా దినోత్సవం, యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు.



గద్దర్, జహీరుద్దీన్‌లకు నివాళులర్పిస్తున్న నాయకులు

తండా నిద్ర

హన్మకొండ: గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ సుబేదారిలోని దుర్గా తండాలో నాయిని రాజేందర్ రెడ్డి తండా నిద్ర చేశారు.



కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత



కానిస్టేబుల్ భార్యకు చెక్కును అందజేస్తున్న సీపీ

వరంగల్ క్రైం: ప్రమాదంలో మరణించిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన ప్రమాద బీమా చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం అందజేశారు. పరకాలలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బొల్లవేని సుధాకర్ గత సంవత్సరం నవంబర్ 11న తన ఇంటి బాత్‌రూంలో కాలు జారి పడి చనిపోయాడు. ప్రమాద బీమా కింద రూ.16 లక్షల చెక్కును కానిస్టేబుల్ భార్య సునితకు సీపీ అందజేశారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణస్వామి, సూపరింటెండెంట్ యుగేందర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ పాల్గొన్నారు.

11న జాతీయ విద్యావిధానంపై ఉపన్యాసం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విద్యావిభాగం, పీవీ విజ్ఞానపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11న జాతీయ విద్యావిధానంపై ఉపన్యాసం ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ- 2020 ఇన్ ది కాంటెక్స్ట్ ఆఫ్ ఫెడరల్ స్పిరిట్' అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు జెండా అందజేత



జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, తపాలాశాఖ అధికారులు

కరీమాబాద్: వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను బుధవారం తపాలా శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా సూపరింటెండెంట్ నర్సింహస్వామి మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ జెండాను అందించారు. ఆజాదీకి అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా 2.0 కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిమీద జాతీయ జెండా ఎగురవేయాలన్న నినాదంతో తపాలా శాఖ ఆధ్వర్యంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ సౌత్ సబ్ డివిజన్ సహాయ పర్యవేక్షకుడు సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం

కార్మిక సంఘాల మహాధర్నాలో దాస్యం వినయ్ భాస్కర్



అభివాదం చేస్తున్న వినయ్‌భాస్కర్, నాయకులు

హన్మకొండ అర్బన్: నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కార్మికులపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కార్మిక సంఘాల రెండు రోజుల దేశవ్యాప్త ధర్నా, నిరసన కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం సుబేదారి కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాన మంత్రి కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్నవి ఊడగొట్టి నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ రైతాంగానికి కనీస మద్దతు ధర ప్రకటించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, ఆ పద్ధతిలో పనిచేస్తున్న వారిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోట భిక్షపతి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, సీఐటీయూ నాయకులు గాదె ప్రభాకర్‌రెడ్డి, మెట్టు రవి, కర్రె భిక్షపతి, జక్కు రాజు, మామిడి శ్యాంసుందర్, నున్న అప్పారావు, అరెల్లి కృష్ణ తదితరులు ఉన్నారు.

స్మార్ట్ రోడ్డు పనుల్లో వేగం పెంచండి

మేయర్ సుధారాణి



ఉర్సుకరీమాబాద్‌లో కొనసాగుతున్న స్మార్ట్‌సిటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్

కరీమాబాద్: నగరంలో చేపట్టిన స్మార్ట్ సిటీ రోడ్డు పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. గ్రేటర్ పరిధిలోని 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లోని కమ్యూనిటీ హాల్ నుంచి సుభాష్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు జరుగుతున్న పనులను బుధవారం కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ...కీర్తి బార్ నుంచి గవిచర్ల క్రాస్ రోడ్డు వరకు స్మార్ట్ సిటీ నిధులు రూ.22 కోట్లతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ సిబ్బంది వాటర్ లీకేజీలు గుర్తించి వాటిని అరికట్టిన తర్వాత రోడ్డు పనులు చేపట్టాలని చెప్పారు. బొడ్రాయి వద్ద ఓపెన్ మ్యాన్‌హోల్‌ను కవర్ చేయాలని ఆదేశించారు. సుభాష్‌నగర్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయం వద్ద డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆదేశించారు. ఉర్సు ప్రతాప్‌నగర్ చెట్బోళ్ల గడ్డ వద్ద డ్రెయినేజీ పూర్తిగా నిండి మురికినీరు రోడ్డు పైకి వస్తుండడంతో స్లాబ్‌ను డ్రిల్ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, పోశాల పద్మ, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

11 నాటికి వరద నష్టం వివరాలు ఇవ్వాలి

వరంగల్ అర్బన్: నగరంలో ఇటీవల కురిసిన అతి భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం సర్వే వివరాలను ఈనెల 11లోగా సమర్పించాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బుధవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఉప కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో వరద నష్టం సర్వే., అనాథల వివరాల సేకరణపై సమీక్షించారు. స్థానిక కార్పొరేటర్ల సమన్వయంతో 66 డివిజన్లలో ఒక్క బాధిత ఇల్లు కూడా తప్పిపోకుండా వరదనష్టం వివరాలు సేకరించాలని ఆదేశించారు.

పడమరకోటలో..

ఖిలా వరంగల్: 38వ డివిజన్ పడమరకోటలో స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమతో కలిసి ఆమె పర్యటించారు. నిర్మాణంలోనున్న కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. అనంతరం కాపువాడలో పర్యటిస్తూ స్థానిక ప్రజలను కలిసి తాగునీరు సరఫరాపై అడిగి తెలుసుకున్నారు.

కేయూ దూరవిద్య డిగ్రీ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. చాలామంది విద్యార్థులు నేరుగా దూరవిద్యాకేంద్రానికి చేరుకుని ఫైన్‌తో పరీక్ష ఫీజు చెల్లించి హాల్‌టికెట్లు పొందారు. తొలిరోజు డిగ్రీ కోర్సుల ఫైనలియర్ పరీక్షలు మొత్తంగా 13 కేంద్రాల్లో జరిగాయి. డిగ్రీ సెకండియర్ గురువారంనుంచి, మొదటి సంవత్సరం పరీక్షలు 11న ప్రారంభం కానున్నాయి.

క్లుప్తంగా

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



మాట్లాడుతున్న శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్ : దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఆ భూములను నిబంధనల మేరకు కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయం బ్యాంక్‌లో జమచేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంతారావు ఆదేశించారు. బుధవారం పాత సెంట్రల్ జైల్ ఎదుట గల దేవాదాయ శాఖ (ధార్మిక భవన్) కార్యాలయంలో ధూప దీపనైవేద్య పథకం ద్వారా లబ్ధిపొందుతున్న అర్చకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 200మంది అర్చకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంతారావు.. అర్చకులు, దేవాదాయశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేవాలయంలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, పర్యవేక్షకులు వీరస్వామి, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ.. నో డిమాండ్

కేయూ డిగ్రీ కళాశాలల్లో సగం కూడా భర్తీ కాని సీట్లు

- 287 కళాశాలల్లో మొత్తం 98,980 సీట్లు
- 34,959 సీట్లు మాత్రమే భర్తీ.. 64,021 ఖాళీ
- ఇక స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, కంప్యూటర్ కాంబినేషన్‌లతో పాటు వివిధ రకాల కోర్సులు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో 2023–2024లో ఆయా డిగ్రీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఇప్పటి వరకు మూడు దశల్లో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా సీట్లు కేటాయింపులు జరిగాయి. యూనివర్సిటీ పరిధిలో ఉన్న సీట్లల్లో సగం కూడా భర్తీకాలేదు. కేవలం 35శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు కలిపి 267 ఉన్నాయి. అందులో వివిధ డిగ్రీ కోర్సులన్నీ కలిపి మొత్తం 98,980 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మే నుంచి జూలై వరకు మూడు దశల్లో అడ్మిషన్ల ప్రక్రియ జరిగింది. మొదటి దశలో కేయూ పరిధిలోని కళాశాలలకు 16,078 సీట్లు కేటాయించగా అందులో 10,678 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత జరిగిన రెండోదశలో 11,112 సీట్లు కేటాయించగా 8,342 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత మూడోదశలో 18,076 సీట్లు కేటాయించగా 15,939 మంది విద్యార్థులు కళాశాలల్లో చేరారు. మూడు దశల్లో నిర్వహించిన డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో మొత్తం 45,266 సీట్లు కేటాయించగా 34,959 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కేవలం 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 64,021 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

స్పెషల్ ఫేజ్‌కు అడ్మిషన్ల ప్రక్రియ షురూ..

రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకుగాను మూడు దశలు ముగిసినా వివిధ యూనివర్సిటీల పరిధిలో సీట్లు చాలా మిగిలాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి దోస్త్ ద్వారా స్పెషల్ ఫేజ్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియకు షెడ్యూల్ జారీ చేసింది. ఈ నెల 7వతేదీ నుంచి స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ అయింది. ఈ నెల 13వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. సోమవారం నుంచి ఈనెల 14వ తేదీవరకు వెబ్ ఆప్షన్‌లు ఇచ్చుకోవాలి. ఈనెల 17న సీట్లు కేటాయింపు జరగనుంది. స్పెషల్ ఫేజ్ నిర్వహించినా కూడా సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యే పరిస్థితి కనపడడంలేదు. ఇంటర్ పూర్తికాగానే ఎక్కువశాతం మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులతోపాటు దూర ప్రాంతాల రాష్ట్రాలకు తరలివెళ్తున్నారు. దీంతో సంప్రదాయ డిగ్రీ కోర్సులకు ఆదరణ తగ్గిపోతుంది. డిగ్రీలో కూడా పలు కొత్త కోర్సులు ప్రవేశపెట్టినప్పటికీ వాటికి కూడా ఆదరణ అంతగా ఉండడం లేదనే సీట్ల భర్తీని బట్టి తెలుస్తోంది. మరోవైపు డిగ్రీలోనూ గురుకులాల సంఖ్య పెంపుదల చేశారు. దీంతో గురుకులాల్లో చేరడంతో ఆ ప్రభావం కూడా ఇతర కళాశాలపై పడిందని భావిస్తున్నారు. మరోవైపు గత విద్యాసంవత్సరంలో విద్యార్థులు అసలే లేని కళాశాలలకు ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్‌లో కొన్నింటికి అవకాశం ఇవ్వలేదు. మరికొన్నింటికి ఇచ్చారు. ఫలితంగా ఆయా కళాశాలల్లో సీట్లు భర్తీ ఈ విద్యాసంవత్సరంలోనూ అంతంత మాత్రమేనని సమాచారం.

మూడుదశల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో కేయూ పరిధిలో గత నెల 27నుంచే క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. స్పెషల్‌ఫేజ్ అడ్మిషన్లకు అవకాశం ఇచ్చినా అంతంతమాత్రమే సీట్లు భర్తీ అయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షం



బోనం ఎత్తుకున్న మంత్రి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో జరిగిన బోనాల వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. బోనం ఎత్తుకుని మహిళలతో కలిసి ముత్యాలమ్మ గుడిలో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించి నిరుద్యోగ యువతను మోసగించిందన్నారు. సీఎం కేసీఆర్ హామీ ప్రకారం 1.33 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశారని, 80 వేలకు పైగా ఖాళీలకు నోటిఫికేషన్లు ఇచ్చారని గుర్తు చేశారు. రూ.152 కోట్లతో తొర్రూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేయనున్నామన్నారు. సంక్షేమ పాలనతో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పట్టణాభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పానుగోటి సోమేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసరావు, దొంగరి రేవతి, నాయకులు కుర్ర శ్రీనివాస్, దొంగరి శంకర్, కర్నె నాగరాజు, జైసింగ్, పూలమ్మ పాల్గొన్నారు.

కేయూలో ఎస్‌ఎఫ్‌సీ విద్యార్థుల ధర్నా

- రెండోరోజూ కొనసాగింపు
- హాస్టల్ వసతి కల్పిస్తామని ప్రిన్సిపాల్, డైరెక్టర్ హామీ
- ఆందోళన విరమణ



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్ఎఫ్‌సీల విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు కూడా బుధవారం ఉదయం 6 గంటల నుంచే గేట్ మూసివేసి ధర్నా చేశారు. మొదటి గేట్ మూసివేతతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీనిపై సమాచారం అందుకున్న యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి సురేష్ లాల్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వై వెంకయ్య మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంకయ్య మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో ఏ ఎస్ఎఫ్‌సీకి సంబంధించిన విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కల్పించలేదన్నారు. అయినా కొందరు నాన్‌బోర్డర్లుగా ఉండడం సరికాదన్నారు. అన్ని ఎస్ఎఫ్‌సీల విద్యార్థులకు మరో 15 రోజుల్లో హాస్టల్ వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కాగా, ఆందోళనకు ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, బి రాకేష్ (ఎన్ఎస్‌యూఐ), మహేష్(పీడీఎస్‌యూ) తదితరులు మద్దతు తెలిపారు.

అవార్డు సాధనకు పోటీ పడాలి

- టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత
- 28 మంది ఉద్యోగులకు ప్రగతి చక్రాల పురస్కారం



ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు అందజేసి సన్మానిస్తున్న ఆర్ఎం శ్రీలత

హన్మకొండ: అవార్డు సాధనకు ఉద్యోగులు పోటీ పడాలని టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత అన్నారు. బుధవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో వరంగల్ రీజియన్ స్థాయి ప్రగతి చక్రాల పురస్కార ప్రదానోత్సవం జరిగింది. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 28 మంది ఉద్యోగులకు ఆర్ఎం శ్రీలత నగదు అవార్డుతో పాటు ప్రశంస పత్రాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో, రీజియన్ స్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయి అవార్డు సాధించడంపై ఉద్యోగులు దృష్టి సారించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగులు సంతోషంగా ఉన్నారన్నారు. అయితే ప్రభుత్వంలో విలీనంతో ఉద్యోగులపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. వరంగల్ రీజియన్ లాభాల్లో నడిచేలా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కృపాకర్ రెడ్డి, మాధవరావు, ఈఈ భాస్కర్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న ఉద్యోగుల వివరాలు...

వరంగల్–1 డిపో డ్రైవర్లు ఎ.రాజేందర్, టి.జె.సింగ్, కె.శ్యామ్, ఎం.శ్రీను, కె.వీరయ్య, భూపాలపల్లి డిపో డ్రైవర్లు కె.రాజేందర్, డి.కోటయ్య, పరకాల డిపో డ్రైవర్ టి.భిక్షపతి, వరంగల్–2 డ్రైవర్లు బి.పోచయ్య, ఎ.వెంకటయ్య, వరంగల్–2 డిపో కండక్టర్ బి.ఎస్.రావు, భూపాలపల్లి కండక్టర్ జి.సునీత, వరంగల్–1 డిపో కండక్టర్ జి.సుధాకర్, ఎస్.రమేష్, మహబూబాబాద్ కండక్టర్లు వీరన్న, వి,ఉమ, హనుమకొండ డిపో కండక్టర్లు ఎస్.రమేష్, ఎస్.కె.వై.పాషా, నర్సంపేట డిపో కండక్టర్లు బి.హరిసింగ్, బి.మహేందర్, టిమ్ డ్రైవర్లు కె.దినేష్‌కుమార్ (హనుమకొండ), టి.దేవేందర్ (హనుమకొండ), బి.సురేష్ (నర్సంపేట), ఎం.డి.షాహీద్ (నర్సంపేట), పి.ఆర్.రెడ్డి (నర్సంపేట), మెకానిక్‌లు టి.శంకరయ్య (వరంగల్–1), ఎం.సంజీవయ్య (వరంగల్–2), శ్రామిక్ ఎస్.సంపత్ కుమార్ (జనగామ) అవార్డులు అందుకున్నారు.

ఆయుర్వేద వైద్యకళాశాలలో అడ్మిషన్లకు అనుమతి

కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ విజయగణేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్ఎం) షరతులతో కూడిన అనుమతి ఇచ్చిందన్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ప్రవేశాల కోసం ఎన్‌సీఐఎస్ఎం తనిఖీలకు సహకరించిన ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బంది, ఫ్యాకల్టీ మెంబర్లు, కళాశాల సిబ్బంది, రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ హరిచందనకు కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ ఆస్తులు పరిరక్షించాలి



సెక్రటరీకి మొక్కను అందజేస్తున్న తన్వీర్

న్యూశాయంపేట: వరంగల్ జిల్లాలో వక్ఫ్ ఆస్తులు పరిరక్షించడానికి చర్యలు తీసుకుని ముస్లింల సమస్యలు పరిష్కరించాలని వరంగల్ వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్, డెవలప్‌మెంట్ కమిటీ, ముస్లిం ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నేతృత్వంలో హైదరాబాద్‌లో మైనారిటీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ ఉమర్ జలీల్‌ను కలిసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ వరంగల్ ఫోర్ట్‌రోడ్‌లోని ఈద్గా అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ. కోటి 40 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల విడుదలకు వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఈద్గా కమిటీ బాధ్యులు ఎం.ఏ.ఖాలీఖ్‌తన్వీర్, సాధిక్ అలీ, ఎం.ఎం. తహశీర్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు ధర పైపైకి..

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.13,221
- వరంగల్‌లో రూ.13వేలు..



కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపుకు రికార్డుస్థాయిలో రూ.13,221 ధర పలికింది. మార్కెట్‌లో పసుపు సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.5 నుంచి 6వేల వరకు పలుకగా, నెల రోజుల నుంచి ధర క్రమక్రమంగా పెరుగుతూవస్తోంది. ఈ మేరకు బుధవారం మార్కెట్‌కు 56 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకం పసుపుకు గరిష్ట ధర రూ.13,221, కనిష్ట ధర రూ.8,651 పలుకగా, గోళారకం పసుపుకు క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.11,752, కనిష్ట ధర రూ.6,509 పలికినట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. కాగా, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో రూ.13వేలు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.13వేల ధర పలికింది. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన నూనె రాజయ్య మార్కెట్‌కు 20 బస్తాల పసుపు తీసుకొచ్చారు. పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు రూ.13వేలు, గోళా రకానికి రూ.12600 పలకిందని యార్డు ఇన్‌చార్జ్ సాగర్ తెలిపారు. ఈ పసుపును జెకె.ఎంటర్‌ప్రైజెస్ నుంచి ఓసాయి ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు తెలిపారు.

'ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటు కావు'

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) సర్వసభ్య సమావేశం చర్చలతోనే అర్ధాంతరంగా ముగిసిందని, ఏకపక్ష నిర్ణయాలు అకుట్ పరిధిలోనికి రావని అధ్యక్షుడు ఆచార్య తౌటం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి , ఉపాధ్యక్షురాలు ఆచార్య బ్రహ్మేశ్వరి, జాయింట్‌సెక్రటరీ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న జరిగిన అకుట్ సర్వసభ్య సమావేశంలో కొందరు అధ్యాపకులు నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారని, అవి చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. సమావేశంలో తీసుకునే నిర్ణయాలకు పూర్తి కోరం అవసరమన్నారు. అందుకే ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటుకావన్నారు.

మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ ఈద్గాలో బుధవారం ఉదయం గత నెల 12న పూడ్చి పెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన షహనజ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమార్తె కాజోల్ (20)వీణాబజార్‌లో ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. కాజోల్ అంబాల గ్రామానికి చెందిన అబ్బాస్‌తో ఆరు సంవత్సరాల నుంచి సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో పెండ్లి విషయంలో కాజల్, అబ్బాస్‌కు గొడవలు జరిగాయి. ఇదిలా ఉండగా అనారోగ్య కారణాల రీత్యా గత నెల 12న కాజోల్‌ను ఎంజీఎంలో అడ్మిట్ చేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే రోజు రాత్రి అబ్బాస్ బొక్కలగడ్డ ఈద్గాలో కాజోల్ మృతదేహం పూడ్చిపెట్టాడు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి షహనజ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి హనుమకొండ తహసీల్దార్ సమక్షంలో కేఎంసీ ఫోరెన్సిక్ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిందితుడిపై చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న ఒకరి మృతి

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామానికి చెందిన తుపాకుల నూకాంబ్రం(60) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. నూకాంబ్రం మంగళవారం ఈత కొమ్మలు కోయడానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొగిలిచర్ల బస్టాండ్ వద్ద వెనక నుంచి అతివేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆయనను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ కమిటీ ఎన్నిక..

- ముగ్గురు కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్లకు చోటు



సంజీవరెడ్డి రవీందర్ ఎస్ఎంరెడ్డి

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ కార్యవర్గ ఎన్నికలు ఈనెల 6 వతేదీ నుంచి బుధవారం వరకు ఆన్‌లైన్‌లో జరిగాయి. కాగా, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో 419 మంది సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలోని వివిధ సైంటిఫిక్ ఇన్‌స్టిట్యూషన్స్ , యూనివర్సిటీల్లోని ప్రముఖ సైంటిస్టులు, ప్రొఫెసర్లు, ఇంజనీర్‌లు, ప్రముఖ వైద్యులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఈ కార్యవర్గంలో ముగ్గురు కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవరెడ్డి, జాయింట్ సెక్రటరీగా కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, కోశాధికారిగా బాటనీ అండ్ మైక్రోబయాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ఎం రెడ్డి ఎన్నికయ్యారు.

స్కూల్‌బస్సును ఢీకొట్టిన జెడ్పీ ఫ్లోర్‌లీడర్ స్వప్న వాహనం

- ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు.. ఒకరిని వరంగల్‌కు రెఫర్
- సకాలంలో రాని 108 వాహనం.. రోడ్డు వెంట వాహనాలు ఆపి తరలించిన స్థానికులు
- జెడ్పీ ఫ్లోర్‌లీడర్‌కు తీవ్రగాయాలు కావడంతో మరో వాహనంలో హనుమకొండకు తరలింపు



ప్రమాదానికి గురైన కారు, బస్సు..



తీవ్రంగా గాయపడిన మహేష్



ప్రమాదంలో గాయపడిన చిన్నారులు

నర్సంపేట రూరల్ : ఆగి ఉన్న స్కూల్ వ్యాన్‌ను వరంగల్ జిల్లా జెడ్పీ ఫ్లోర్ లీడర్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. అందులో ఒకరిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు రెఫర్ చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ శివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణంలోని పాత్‌ఫైండర్ స్కూల్‌కు చెందిన ఇటుకాలపల్లి, నారక్కపేటకు రూట్ స్కూల్ బస్సు సాయంత్రం 5.20 గంటలకు 24 మంది పిల్లలతో బయలుదేరి వెళ్లింది. నారక్కపేట వైపు వెళ్లేందుకు 365 జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. ముందు ద్విచక్రవాహనం ఉండడంతో డ్రైవర్ బస్సు నిలిపిఉంచారు. ఆ సమయంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న ఫార్చ్యూనర్ కారులో డ్రైవర్‌తో కలిసి ముత్తోజీపేట వైపు వేగంగా వస్తున్నాడు. ద్విచక్రవాహనాన్ని తప్పించపోయి కమలాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు వైపు తిప్పడంతో ఆ పక్కనే నిలిపివేసిన బస్సు వెనుకవైపు ఢీకొట్టారు. దీంతో బస్సు పల్టీ కొట్టే సమయంలో పక్కనే చెట్టు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులోని 19మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. పెద్ది స్వప్నకు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. 108 వాహనం సకాలంలో రాకపోవడంతో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి 11మంది తరలించగా ముగ్గురికి తీవ్రగాయాలైన అన్విత్, కీర్తనలను ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన ఎం. మహేష్‌కు ప్రాథమిక చికిత్స నిర్వహించి వరంగల్‌కు రెఫర్ చేశారు. మరో 8మందిని నర్సంపేట పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో రిత్విక్, సహస్ర, నందు, దీక్షిత్‌లకు తీవ్రగాయాలు కాగా అడ్మిట్ చేశారు. మిగతావారికి చికిత్స అందించి తల్లిదండ్రులకు అప్పగించారు. నర్సంపేట ఏసీపీ తిరుమల్, టౌన్ సీఐ రవికుమార్, రూరల్ సీఐ కిషన్ ఆధ్వర్యంలో ప్రమాదంపై విచారణ జరుపుతున్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థి సంఘాల నాయకులు పోలీసులను కోరారు.

హనుమకొండకు పెద్ది స్వప్న తరలింపు

ప్రమాదంలో గాయపడిన జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నను వెంటనే వేరే వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నట్లు సమాచారం.